సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 8 | డిసెంబర్ | 2023



ఎల్‌బీ కళాశాలకు ఘన చరిత్ర
ఎల్‌బీ కళాశాలకు ఘన చరిత్ర ఉందని, పేద విద్యార్థులకు విద్యనందించిన ఏకైక విద్యాసంస్థ ఎల్‌బీ కళాశాల అని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పేర్కొన్నారు. - 8లో▸



అంతర్ జిల్లా వాహనాల దొంగ అరెస్ట్
వివిధ జిల్లాల్లో వాహన చోరీలకు పాల్పడుతున్న దొంగను హసన్‌పర్తి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. - 8లో▸



వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు పడే అవకాశం ఉంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

9,10 తేదీల్లో కిక్‌బాక్సింగ్ పోటీలు



హన్మకొండ: హనుమకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో తెలంగాణ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోశ్, ఎస్.తిరుపతి తెలిపారు. చాంపియన్‌షిప్ బ్రోచర్లను గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈపోటీల్లో అండర్-14, 17, 19 కేటగిరీల నుంచి 30 ఏళ్లలోపు క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 600ల మంది క్రీడాకారులు హాజరవుతారని సంతోశ్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇక నుంచి సీడీఓఈగా ఎస్‌డీఎల్‌సీఈ

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లెర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (ఎస్‌డీఎల్‌సీఈ)గా కొనసాగుతుండగా.. ఇక నుంచి ఆ పేరును సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)గా మారుస్తూ కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూజీసీ (ఓడీఎల్ ప్రోగ్రామ్స్ అండ్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్) రెగ్యులేషన్ 2020, యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో నిబంధనలకు అనుగుణంగా పేరు మార్చినట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

1988-89లో ఎస్‌డీఎల్‌సీఈ ఏర్పాటు

కేయూ పరిధిలో ఎస్‌డీఎల్‌సీఈ 1988-89లో ఏర్పాటైంది. అప్పట్లో డిగ్రీ, పీజీ, వివిధ డిప్లొమా కోర్సులను దూరవిద్యా విధానంలో ప్రారంభించి 35 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. వేలాది మంది డిగ్రీలు పొందారు. అనంతరం డిప్లొమా కోర్సులు ప్రవేశపెట్టారు. కాగా.. పేరు మార్పు అనంతరం.. త్వరలో ఆన్‌లైన్ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు భావిస్తున్నారు.

నిట్‌లో ప్రారంభమైన 'ఇస్టామ్' సదస్సు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం ఇస్టామ్ (ఇండియన్ సొసైటీ ఆఫ్ థియరిటికల్ అండ్ అప్లైడ్ మెకానిక్స్) రెండు రోజుల 68వ సదస్సును అట్టహాసంగా ప్రారంభించారు. డీప్ ఓషన్ మిషన్ ప్రాజెక్టు, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎం వీ.రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ఇస్టామ్ ప్రెసిడెంట్ దీపక్‌కుమార్, సెక్రటరీ జోజెఫ్, డేవిడ్ లారోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎంఫార్మసీ రెండో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్ అండ్ ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 8 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 8, 11, 13, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

పరీక్షలు రద్దు

వరంగల్ లీగల్: న్యాయస్థానాల్లో ఉద్యోగాల కోసం నవంబర్ 5, 6 తేదీల్లో జరిగిన టైపిస్ట్, కాపీయిస్ట్ పరీక్షలు సాంకేతిక కారణాలతో రద్దు చేసినట్లు ఇటీవల హైకోర్టు ప్రకటించిందని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టైప్ రైటింగ్ పరీక్షను మళ్లీ ఈనెల 10న ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హైకోర్టు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వణుకుతున్న జిల్లా

హన్మకొండ: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో శీతల వాతావరణం నెలకొంది. మూడ్రోజులుగా జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత 22, కనిష్ఠ ఉష్ణోగ్రత 19గా నమోదైంది. దీంతో చలి ప్రభావం పెరిగింది. ఈదురుగాలుల కారణంగా చలితో జిల్లావాసులు వణుకుతున్నారు. గురువారం ఆకాశం మేఘావృతమైంది. రోజంతా వాతావరణం చల్లగా ఉంది. మరో 48 గంటలు ఇలాగే ఉండనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.



ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి సీతక్కతో కలిసి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి





ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నమస్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

మహిళా నేతల మెడలో అమాత్య వరమాల!

రాష్ట్ర మంత్రులుగా కొండా సురేఖ, ధనసరి సీతక్క

- ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు నేతలను వరించిన పదవులు
- సీఎం రేవంత్‌తోపాటు ప్రమాణ స్వీకారం
- ఆ సమయంలో కేరింతలతో హోరెత్తించిన శ్రేణులు
- నేడు లేదా రేపు.. జిల్లాకు రానున్న మంత్రులు





ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ

సాక్షిప్రతినిధి, వరంగల్:

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో ఉమ్మడి వరంగల్ నుంచి ఇద్దరు మహిళా నేతలకు అవకాశం దక్కింది. తెలంగాణలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వం ఓరుగల్లుకు పెద్దపీట వేసింది. ఇద్దరు మంత్రుల్లో ఒకరు మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, మరొకరు ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క (అనసూయ). సీఎం సహా 12 మందితో తొలి మంత్రివర్గం ప్రమాణం చేయగా.. అందులో ఇద్దరు మహిళలు ఉండడం.. ఆ ఇద్దరు కూడా ఉమ్మడి జిల్లాకు చెందిన వారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా.. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొండా సురేఖకు మహిళా సంక్షేమం, ధనసరి సీతక్కకు గిరిజన సంక్షేమశాఖ కేటాయించినట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. కానీ ఎవరికీ ఏ శాఖ కేటాయించలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వీరికి ఏ శాఖలు కేటాయించనున్నారో ఒకటి, రెండు రోజుల్లో తేలనుంది. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడవగా.. సీఎల్పీ నేత ఎంపిక, సీఎం ప్రమాణ స్వీకారం వరకు ఉమ్మడి జిల్లా నుంచి గెలుపొందిన 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లోని హోటల్ ఎల్లాలోనే ఉన్నారు. గురువారం సాయంత్రమే ఎమ్మెల్యేలు జిల్లాకు చేరుకోగా.. సీఎంగా రేవంత్‌తోపాటు ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులు సురేఖ, సీతక్క నేడో, రేపో జిల్లాకు రానున్నట్లు పార్టీవర్గాల సమాచారం.

సీనియార్టీ, విధేయతకు పట్టం

సీనియార్టీతో పాటు పార్టీపై విధేయత చూపిన కొండా సురేఖ, ధనసరి సీతక్కకు ఉమ్మడి జిల్లానుంచి రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా అవకాశం దక్కింది. కాగా.. కొండా సురేఖ గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. రాజకీయంగా అనేక ఒడిదొడుకులు ఎదురైనా.. మొక్కవోని దీక్షతో ఆమె ప్రజల పక్షాన నిలిచారు. ఎంపీటీసీ, ఎంపీపీగా పనిచేసి మొదటిసారిగా 1999, 2004లో శాయంపేట నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో పరకాల నుంచి పోటీ చేసి విజయం సాధించి వైఎస్సార్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్ జగన్‌ను సీఎం చేయలేదని రాజీనామా చేశారు. చాలాకాలం పాటు వైఎస్సార్‌సీపీలో కొనసాగారు. రాష్ట్ర విభజన సమయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. 2014లో వరంగల్ తూర్పు నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఆమె.. ఆతర్వాత ఆ పార్టీ నేతలతో విభేదించి 2018లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి 2023లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ తూర్పు నుంచి విజయం సాధించారు. ఆమె సీనియార్టీని గుర్తించిన అధిష్టానం మంత్రి పదవిని కట్టబెట్టింది. సుమారు రెండున్నర దశాబ్దాల పాటు జనాన్ని విడిచి అడవిబాట పట్టి సమసమాజ స్థాపన కోసం పని చేసిన ధనసరి సీతక్క (అనసూయ).. జనజీవన స్రవంతిలో కలిశాక రాజకీయాల్లోకి వచ్చారు. 2004లో టీడీపీ టికెట్‌పై ములుగు నుంచి ఎన్నికల బరిలోకి దిగిన సీతక్క ఆ ఎన్నికల్లో ఓటమి పాలై.. 2009లో పొదెం వీరయ్య (కాంగ్రెస్)పై విజయం సాధించారు. రాష్ట్ర పునర్విభజన నేపథ్యంలో.. టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన సీతక్క 2018లో అప్పటి మంత్రి అజ్మీరా చందూలాల్‌పై గెలుపొందారు. కరోనా సమయంలో ప్రజలకు వెన్నంటి ఉన్న ఆమె ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

'జనసిరి' సీతక్క

ఉమ్మడి వరంగల్‌లోని జగ్గన్నపేటలో ఆదివాసీ కోయ తెగ కుటుంబంలో జన్మించారు ధనసరి అనసూయ(సీతక్క). రాజకీయాల్లోకి రాక ముందు ఆమె నక్సలైట్. 1988లో జనశక్తి నక్సల్ గ్రూపులో చేరారు. పదకొండేళ్లపాటు ఉద్యమంలో పనిచేశారు. ఆ తర్వాత సాధారణ క్షమాభిక్ష పథకం కింద పోలీసులకు లొంగిపోయారు. తర్వాత ఆమె తన చదువును కొనసాగించి న్యాయవాదిగా మారారు. 2022లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్ చదివారు. తొలిసారిగా 2004లో రాజకీయ రంగ ప్రవేశం చేసి తెలుగుదేశం పార్టీలో చేరి ములుగు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2009లో మళ్లీ అక్కడి నుంచే పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై భారీ మెజార్టీతో గెలిచారు. 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అజ్మీరా చందూలాల్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2017లో సీతక్క టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆపార్టీలో చురుకైన పాత్ర పోషించి అఖిల భారత మహిళా కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత కాంగ్రెస్ మహిళా విభాగం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2018, 2023లో ములుగు నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. గురువారం ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

'పవిత్ర హృదయం'తో..

లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం కిక్కిరిసిన కాంగ్రెస్ శ్రేణులు, పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషుల హర్షధ్వానాల మధ్య పదవీ ప్రమాణ స్వీకార వేడుకలు జరిగాయి. ప్రమాణ స్వీకారం చేయడానికి ఒక్కొక్కరినీ పేరుపెట్టి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి పిలిచారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారందరితో ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా జిల్లా నుంచి నియమితులైన ఇద్దరు మంత్రుల్లో మొదటగా కొండా సురేఖ 'దైవ సాక్షి'గా ప్రమాణం చేయగా.. ఆ తర్వాత ప్రమాణ స్వీకారం చేసిన ధనసరి సీతక్క 'పవిత్ర హృదయం'తో ప్రమాణం చేస్తున్నానన్నారు. సీతక్క పేరు పిలవగానే ఒక్కసారిగా అక్కడున్న జనం నుంచి హర్షధ్వానాలు, కేరింతలు కొట్టారు. కాగా.. కొద్దిక్షణాలు ఆగిన సీతక్క.. గవర్నర్ తమిళిసై సూచనతో వెంటనే ప్రమాణం చేశారు.

ఇద్దరూ ఇద్దరే..
- కేబినెట్‌లో ఒకేసారి జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలకు చోటు
- సురేఖ, సీతక్కలిద్దరూ డైనమిక్ లీడర్లుగా గుర్తింపు

- 8లో▸

'కొండ'ంత అండ సురేఖ

కొండా సురేఖ 1965 ఆగస్టు 19న ఉమ్మడి వరంగల్ జిల్లా ఊకల్‌లో తుమ్మ చంద్రమౌళి, రాధ దంపతులకు జన్మించారు. పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ చదివారు. ఆమె 1995లో మండల పరిషత్‌కు ఎన్నికయ్యారు. 1996లో ఆంధ్రప్రదేశ్ పీసీసీ సభ్యురాలిగా నియమితులయ్యారు. 1999లో శాయంపేట నుంచి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1999లో కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ కోశాధికారిగా, మహిళా, శిశు సంక్షేమశాఖ సభ్యురాలిగా, ఆరోగ్య, ప్రాథమిక విద్య కమిటీ సభ్యురాలిగా పని చేశారు. 2000 సంవత్సరంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. 2004లో శాయంపేట శాసనసభ్యురాలిగా ఎన్నికై, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. 2005లో సురేఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా పనిచేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పరకాల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, బధిరుల సంక్షేమ మంత్రిగా పని చేశారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవిని ఇవ్వనందున రాజీనామా చేశారు. 2011 జూలై 4న శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2012 జూన్ 12న జరిగిన ఉప ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. ఆతర్వాత 2013 జూలైలో వైఎస్‌ఆర్ సీపీకి రాజీనామా చేసిన ఆమె.. అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరి వరంగల్ తూర్పు శాసనసభ నియోజకవర్గం నుంచి శాసన సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 2018లో మళ్లీ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో పరకాల నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన రెండో జాబితాలో తూర్పు వరంగల్ అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన సురేఖ గురువారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జగ్గన్నపేటలో జోష్.. మురిసిన వంచనగిరి
- సీతక్క, కొండా సురేఖకు మంత్రి పదవులు రావడంపై గ్రామస్తుల హర్షం

- వివరాలు 8లో▸

నూతన ప్రభుత్వానికి టీఎన్జీఓస్ అభినందనలు



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీకి టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా శాఖ శుభాకాంక్షలు తెలిపింది. గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన టీఎన్జీఓస్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకుని కొత్త ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లా నుంచి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కొండా సురేఖ, ధనసరి సీతక్కకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ప్రజాపాలన అందించడానికి ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేస్తారన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యాం, లక్ష్మీప్రసాద్, సలీం, రాజమౌళి, రాజేశ్‌ఖన్నా, రాజేశ్వర్‌రెడ్డి, పైడిరాజు, శ్రీనివాస్, శివ, రఫీ తదితరులు ఉన్నారు.

గురుకులాలను పటిష్టం చేయాలి

టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కుమార్



మాట్లాడుతున్న టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు అజయ్‌కుమార్

విద్యారణ్యపురి: తెలంగాణలోని వివిధ గురుకుల పాఠశాలల పటిష్టానికి పాటుపడాలని తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ టీజీపీఏ కార్యాలయంలో ఆ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రకటించి పెండింగ్‌లో పెట్టిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. అన్ని గురుకుల పాఠశాలలను కలిపి కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని, గురుకుల విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని నూతన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో టీజీపీఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.భిక్షపతి, కార్యదర్శి గంధ్ర శ్రీకాంత్, ఉమెన్ సెక్రటరీ తాళ్ల నీలిమాదేవి, ఉపాధ్యక్షురాలు ముత్తిరెడ్డి నీరజ, కార్యవర్గ సభ్యులు కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఈనెల 10న నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురువారం డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. 8వ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులు ఈపరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల, పరకాలలోని ఎస్సార్ హైస్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 10న ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు హాల్‌టికెట్లతోపాటు బ్లాక్ లేదా బ్లూ బాల్‌పాయింట్‌పెన్ తీసుకుని రావాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందు హాజరుకావాలని, హాల్‌టికెట్లు సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు.

ఖమ్మం జాతీయ రహదారి ఫోర్ట్‌రోడ్డుపై గ్యాస్ కంపెనీ వద్ద బారులుదీరిన మహిళలు



సిలిండర్ ఈ-కేవైసీ కోసం బారులు

ఖిలా వరంగల్: 'గ్యాస్ సిలిండర్ కావాలంటే.. ఈకేవైసీ తప్పనిసరి' అని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ నిర్వాహకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేయనుందని, ఇందు కోసం ఆధార్‌కార్డు అనుసంధానం, మొబైల్ ఫోన్ లింక్‌తోపాటు ఈకేవైసీ చేసుకోవాలని డిస్ట్రిబ్యూటర్ నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో గురువారం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి ఫోర్ట్‌రోడ్డుపై పెరకవాడలోని భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయం వద్దకు ఉదయం 8 గంటలకే వందలాది మంది వినియోగదారులు చేరుకున్నారు. గ్యాస్ కంపెనీ నిర్వాహకుల రాక కోసం మహిళలు ఎక్కువ సంఖ్యలో ఆధార్‌కార్డు, గ్యాస్ బుక్ చేతులో పట్టుకుని ఎదురు చూస్తూ కనిపించారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజలు గంటల కొద్ది లైన్‌లో నిరీక్షించారు. గురువారం చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో మహిళలు, వృద్ధులు వణుకుతూ లైన్‌లో కనిపించారు. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున ప్రజలు నినాదాలు చేయడంతో గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం దిగి వచ్చి మధ్యాహ్నం మరో రెండు అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసింది.

మాదకద్రవ్యాల వినియోగంతో సమాజానికి ముప్పు



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: మాదక ద్రవ్యాల వినియోగంతో సమాజాభివృద్ధికి పెనుముప్పు వాటిల్లుతోందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సమాజ ప్రగతికి అడ్డంకిగా మారిన మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికపై మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైన్స్‌లను పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీఓ జగదీశ్వర్, డీడబ్ల్యూఓ మధురిమ, డీఎంహెచ్ఓ సాంబశివరావు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సంతోశ్ తదితరులు ఉన్నారు.

జగ్గన్నపేటలో జోష్.. మురిసిన వంచనగిరి

సీతక్క, కొండా సురేఖకు మంత్రి పదవులు రావడంపై గ్రామస్తుల హర్షం

- మహిళలకు సముచితస్థానం కల్పించారు..
- జిల్లాలు అభివృద్ధిలో పరుగులు పెడతాయని ఆశాభావం
- అమాత్యుల సొంత గ్రామాల ప్రజల మనోగతం

ములుగు/ ములుగు రూరల్:



15 ఏళ్లకు పైగా అజ్ఞాత జీవితం గడిపి 1990 దశకంలో జనజీవన స్రవంతిలో కలిసిన ములుగు ఎమ్మెల్యే సీతక్క.. ఇరవై సంవత్సరాల నుంచి రాజకీయంలో కొనసాగుతున్నారు. ఆదివాసీలు, గిరిజనేతలకు అండగా ఉంటూ ప్రజామన్ననలు పొందుతున్నారు. ఆపత్కాలంలో నేనున్నాంటూ బాధితులకు కొండంత భరోసా ఇస్తూ వారితో జేజేలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో 2023 సాధారణ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది తెలంగాణ ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో సీతక్క గ్రామమైన జగ్గన్నపేటలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి పదవి దక్కడంపై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'కి వెల్లడించారు.





ప్రమాణాస్వీకారం అనంతరం ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి సీతక్క, ఏఐసీసీ నేత ప్రియాంకగాంధీతో కరచాలనం చేస్తున్న మంత్రి సురేఖ. చిత్రంలో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ

సమస్యలు పరిష్కరిస్తారు



ములుగు మండలం జగ్గన్నపేట గ్రామ పంచాయతీ వ్యక్తిగా ధనసరి సీతక్కకు మంత్రి వర్గంలో చోటు దక్కడం సంతోషంగా ఉంది. మా గ్రామం రాష్ట్ర స్థాయిలో మార్మోగడం ఆనందంగా ఉంది. ములుగు నియోజకవర్గంలో అపరిష్కృతంగా నెలకొన్న సమస్యలు సీతక్క పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

- బొంతల శ్రీను, జగ్గన్నపేట

సీతక్కకు సముచిత స్థానం



ములుగు నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ధనసరి సీతక్కకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం ఇవ్వడం సంతోషంగా ఉంది. కరోనా సమయంతో పాటు ప్రజలు ఆపదలో ఉన్న ప్రతిసారీ సీతక్క ప్రజలకు అండగా నిలబడింది. దీంతో ఆమె చేసిన సేవే 2023 శాసన సభ ఎన్నికల్లో గెలుపొందడానికి ప్రధానమైంది.

- ముంజాల భిక్షపతి గౌడ్, ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు,ములుగు

మంత్రి పదవి రావడం ఆనందంగా ఉంది



మా గ్రామానికి చెందిన ధనసరి సీతక్కకు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం దక్కడం ఆనందంగా ఉంది. సీతక్క పార్టీకి కట్టుబడి ఉండి ప్రజామన్ననలు పొంది మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీతక్కకు ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు.

-మద్ది సంపత్, జగ్గన్నపేట

సీతక్క మా గుంపు మనిషి



ములుగు మండలం జగ్గన్నపేట పంచాయతీ పరిధిలోని ఆదివాసీ గుంపునకు చెందిన సీతక్క రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం మాకు సంతోషంగా ఉంది. సీతక్క 20 సంవత్సరాల నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి పాల్పడ్డారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాం.

-వంక కాంతమ్మ, జగ్గన్నపేట

అజ్ఞాతం నుంచి రాష్ట్ర స్థాయికి..



ములుగు ఎమ్మెల్యేగా మూడో సారి గెలిచిన సీతక్క అజ్ఞాతం నుంచి జనజీవన స్రవంతిలో కలిసి పేదల కోసం రాజకీయాల్లోకి వచ్చారు. నిరుపేదల సేవే పరమావధిగా భావిస్తూ తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టడం మాకు గర్వంగా ఉంది. ప్రజల యోగక్షేమాలే తన బలం. అందుకే ప్రజలు మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించి అత్యుత్తమ స్థానం అప్పగించారు.

-కావటి రాజేందర్, జగ్గన్నపేట

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు లభించింది. దీంతో స్వగ్రామం గీసుకొండ మండలం వంచనగిరిలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామంలోని కాంగ్రెస్, కొండా అభిమానులు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కాగా, సురేఖ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ మంత్రి వర్గంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు.

-గీసుగొండ

సంతోషంగా ఉంది



సురేఖకు మంత్రి పదవి రావడం మాకు సంతోషంగా ఉంది. కొండా దంపతులు అంటే మాకు ఎంతో అభిమానం. గతంలో ఎంపీటీసీగా మా గ్రామం నుంచి గెలుపొంది రాజకీయ రంగప్రవేశం చేసిన ఆమె.. మళ్లీ మంత్రి కావడం సామాన్య విషయం కాదు.

- అమిరిశెట్టి రాజు, గ్రామస్తుడు

మా ఊరికి మళ్లీ గుర్తింపు వచ్చింది



పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండడంతో రాజకీయంగా కొండ దంపతుల పని అయిపోయిందని ప్రచారం చేశారు. వారి గురించి తక్కువ చేసి మాట్లాడారు. సురేఖకు మంత్రి పదవి రావడంతో మా ఊరు మరోసారి వెలుగులోకి వచ్చింది.

-నాగసమోయిన సారంగం,గ్రామస్తుడు

మా ఊరుకు దక్కిన గౌరవం



సురేఖ మా ఊరి కోడలు కావడం మా అదృష్టం. ఎప్పుడు ఊరికి వచ్చిన మమ్ములను ఆప్యాయంగా పలుకరిస్తుంది. పోచమ్మ, కోట మైసమ్మ బోనాల పండుగకు మాతో పాటు పాల్గొంటారు. ఆమెకు మంత్రి పదవి రావడం మాకు సంతోషంగా ఉంది.

- అమిరిశెట్టి అనసూయ, సర్పంచ్, వంచనగిరి

సమస్యలు పరిష్కారమవుతాయి



మా గ్రామానికి గతంలో వచ్చిన నిధుల్లో రూ. నాలుగు కోట్లు వెనుకకు వెళ్లాయి. దీంతో చాలా పనులు పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్నాయి. సురేఖ మేడం గ్రామంపై ప్రత్యేక దృష్టి పెడుతుందని ఆశపడుతున్నాం.

-నాగరబోయిన రజిత, ఎంపీటీసీ

ఇద్దరూ ఇద్దరే..

కేబినెట్‌లో ఒకేసారి జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలకు చోటు

- ఇప్పటివరకు ఇద్దరు మహిళలే మంత్రులుగా పనిచేశారు.. సీతక్కతో ఆ సంఖ్య మూడుకు..
- సురేఖ, సీతక్కలిద్దరూ డైనమిక్ లీడర్లుగా గుర్తింపు

వరంగల్ డెస్క్: ప్రజా సమస్యలపై, బూర్జువా విధానాలపై తుపాకీ చేతబట్టి అడవులకు వెళ్లిన ఆదివాసీ బిడ్డ ఆమె. అడవిలోకంటే జనంలో ఉండి తను అనుకున్న ప్రజాసేవ లక్ష్యాన్ని చేరుకునేందుకు జనజీవన స్రవంతిలో కలిసిన ఆమె రాజకీయాల్లోకి వచ్చింది. అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ గుర్తింపు పొందింది. ఇప్పుడు ఆ ఆదివాసీ బిడ్డ రాష్ట్ర మంత్రి అయ్యింది. ములుగు ఎమ్మెల్యేగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ధనసరి అనసూయ అలియాస్ సీతక్కకు కాంగ్రెస్ తగిన గుర్తింపును ఇచ్చింది. మరో మహిళ కొండా సురేఖ. డిగ్రీ పూర్తి చేసిన తరువాత 1995లో రాజకీయ అరంగేట్రం చేశారు. మండల పరిషత్ సభ్యురాలినుంచి అంచలంచెలుగా ఎదిగి 1999లో ఆమె శాయంపేట నియోజకవర్గం నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. వైఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆమెకు పదేళ్ల తరువాత మరోమారు అమాత్య పదవి వరించింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఇద్దరు మహిళలకు డైనమిక్ లీడర్లుగా గుర్తింపు ఉంది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇప్పటి వరకు వేర్వేరు ప్రభుత్వాల్లో ఇద్దరు మహిళలు సురేఖ, సత్యవతి రాథోడ్ మంత్రులుగా పని చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో సీతక్కకు మంత్రి పదవి లభించడంతో మంత్రుల సంఖ్య మూడుకు చేరింది.

1960 నుంచి 2023 ఎన్నికల ముందు వరకు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1960 నుంచి ఇప్పటి వరకు 23 మంది ప్రజాప్రతినిధులు రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 మంది పనిచేయగా.. టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వంలో 9 మంది మంత్రులుగా కొనసాగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్ఎస్ నుంచి ఒక్కరు మంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి నూకల రాం చంద్రారెడ్డి, పింగిళి ధర్మారెడ్డి, గోక రామస్వామి, టి.హయగ్రీవాచారి, మాదాడి నర్సింహారెడ్డి, బొచ్చు సమ్మయ్య, పోరిగ జగన్నాయక్, తక్కళ్లపల్లి పురుషోత్తమరావు, పీవీ రంగారావు, పొన్నాల లక్ష్మయ్య, కొండా సురేఖ, డీఎస్ రెడ్యానాయక్, బస్వరాజు సారయ్య మంత్రులుగా పని చేశారు. టీడీపీ ప్రభుత్వంలో సంగంరెడ్డి (ముచ్చర్ల) సత్యనారాయణ, నెమరుగొమ్ముల యతిరాజారావు, నిమ్మ రాజారెడ్డి, దాస్యం ప్రణయ్‌భాస్కర్, కడియం శ్రీహరి మంత్రులుగా కొనసాగారు. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వంలో తాటికొండ రాజయ్య తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రిగా, కడియం శ్రీహరి రెండో ఉప ముఖ్యమంత్రిగా, మంత్రిగా, అజ్మీరా చందూలాల్ మంత్రులుగా పని చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు మంత్రులుగా కొనసాగారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో గుండె విజయరామారావు మంత్రిగా పనిచేశారు. తాజాగా కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం.. ఉమ్మడిజిల్లానుంచి ఇద్దరు మహిళలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

డైనమిక్ లీడర్‌గా పేరు..

కొండా సురేఖ 2009లో కాంగ్రెస్ పార్టీనుంచి పరకాలనుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో ఆమె మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, బధిరుల సంక్షేమ మంత్రిగా పనిచేశారు. తాజాగా వరంగల్ తూర్పునుంచి అదే కాంగ్రెస్ పార్టీనుంచి మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఏ శాఖ కేటాయిస్తారన్నది స్పష్టత లేదు. ఉమ్మడి జిల్లాలో కొండా సురేఖకు డైనమిక్ లీడర్‌గా పేరుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పక్షం వారిని సమస్యలపై నిలదీయడం.. ఎటువంటి జంకు లేకుండా మాట్లాడడం ఆమె నైజంగా చెబుతారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆమె తన ప్రత్యర్థిని నేరుగా నిలదీసిన వీడియోలు స్థానికంగా సంచలనం సృష్టించాయి.

సీతక్కకు మొదటిసారి మంత్రి పదవి

ములుగు ఎమ్మెల్యే ధనసరి అనసూయ అలియాస్ సీతక్కకు మొదటిసారి మంత్రి పదవి వరించింది. టీడీపీలో రేవంత్‌రెడ్డి, సీతక్కలు కలిసి పనిచేశారు. అప్పటినుంచే ఇద్దరు సొంత అన్నాచెల్లిగా మెదిలారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడానికి ముందే ఇరువురు ఒక నిర్ణయానికి వచ్చారు. మాటకు కట్టుబడి ఒకేసారి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓటమిపాలవగా సీతక్క గెలుపొందింది. అయినా రేవంత్‌రెడ్డి వెంబడి అండగా నిలిచారు. రేవంత్‌రెడ్డి.. సీతక్కను అక్కగా సంబోధిస్తారు. ప్రతి రాఖీ పండుగ రోజు సీతక్కతో రాఖీ కట్టించుకుంటారు. ఆత్మీయతతో పాటు తనతో కష్టకాలంలో నిలిచిన సీతక్కకు రేవంత్‌రెడ్డి తగిన గుర్తింపు ఇచ్చారని జిల్లావాసులు చర్చించుకుంటున్నారు.

ఎల్‌బీ కళాశాలకు ఘన చరిత్ర

- ఉత్తర తెలంగాణ పేదలకు విద్యనందించిన ఏకైక విద్యాసంస్థ
- కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్

రామన్నపేట : ఎల్‌బీ కళాశాలకు ఘన చరిత్ర ఉందని, ఉత్తర తెలంగాణలో వేలాది మంది పేద విద్యార్థులకు విద్యనందించిన ఏకైక విద్యాసంస్థ ఎల్‌బీ కళాశాల అని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ పేర్కొన్నారు. లాల్‌బహదూర్ కళాశాల 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వీసీ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి ఇక్కడి అధ్యాపకులు, యాజమాన్యం చేసిన కృషిని కొనియాడారు. ఎల్‌బీ కళాశాల అన్ని రంగాల్లో పోటీ తట్టుకుని 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సబ్జెక్టులో గొప్ప అధ్యాపకులు ఉండడం వల్ల ఆరోజుల్లో ఈ కళాశాలలోఅడ్మిషన్ లభించితే ఉద్యోగం దొరికినంత గొప్పగా భావించే వారని పేర్కొన్నారు. నేటికీ నాణ్యతాప్రమాణాలతో విద్యనందిస్తూ మారుమూల ప్రాంతాల విద్యార్థులను కూడా ఉన్నతంగా తీర్చిదిద్దుతోందని కొనియాడారు. మరో విశిష్ట అతిథి 10వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అజయ్ నంద కందూరి కళాశాల ప్రతిష్టను కొనియాడారు. కళాశాల సెక్రటరీ రాజేందర్ మాట్లాడుతూ కళాశాలకు కావాల్సిన మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు యాజమాన్యం తరఫున కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల 50 వసంతాల ప్రత్యేక లోగోను ఆవిష్కరించారు. అంతకుముందు ఎల్‌బీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య పీజీ పరీక్షల్లో ఆరుగురి డీబార్



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో దూర విద్య కేంద్రం పీజీ కోర్సుల సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో ముగ్గురు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఒకరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలోఒకరు మొత్తం ఆరుగురు విద్యార్థులు కాపీయింగ్ చేస్తుండగా ఆయా పరీక్ష కేంద్రాల అబ్జర్వర్లు పట్టుకుని డీబార్ చేసినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ తెలిపారు. కాగా, వరంగల్ ఎల్‌బీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆయా పీజీ కోర్సుల పరీక్షల నిర్వహణ తీరును వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ పరిశీలించారు.

అంతర్ జిల్లా వాహనాల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

హసన్‌పర్తి: వివిధ జిల్లాల్లో వాహన చోరీలకు పాల్పడుతున్న దొంగను హసన్‌పర్తి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుడు హైదరాబాద్‌కు చెందిన జన్ను సంతోష్ అని తెలిపారు. సీఐ గోపీ కథనం ప్రకారం బహుపేట క్రాస్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో నంబర్ లేని వాహనంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వివిధ ప్రాంతాల్లో వాహనాలు చోరీచేసినట్లు ఆ యువకుడు అంగీకరించాడు. దీంతో నిందితుడి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కాగా, అంతర్ రాష్ట్ర దొంగను పట్టుకున్న ఎస్సై సురేశ్, సిబ్బందిని సీఐ గోపీ అభినందించారు.

కెమికల్ రీ ఏజెంట్స్ టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో 2023–24 సంవత్సరానికి కెమికల్ రీఏజెంట్స్, కిట్స్ కొనుగోళ్లకు టెండర్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి 22వ తేదీ వరకు టెండర్‌లో భాగంగా దరఖాస్తులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. 30న ప్రిన్సిపాల్ చాంబర్‌లో దరఖాస్తులు తెరవనున్నట్లు, అప్లికేషన్ రుసుం రూ.1,000 డీడీ సమర్పించి రూ.10 వేలు ఈఎండీ దరఖాస్తు అప్లికేషన్‌తో సమర్పించాలని సూచించారు.

వార్డు సభ్యుడి ఆత్మహత్య



కాటారం: అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగి ఓ వార్డు సభ్యుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండలం మేడిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు వెన్నపురెడ్డి రామకృష్ణ(31) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రామకృష్ణ బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ గురువారం తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

చిట్యాల: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అందుకుతండాలో జరిగింది. గ్రామానికి చెందిన దామెరశెట్టి నరేశ్ (23) ఆరు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన నొప్పి తీవ్రం కావడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

నేడు కేయూలో ఐపీఆర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనాభవనం సెనేట్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) అండ్ కేరీర్ ఇన్ ఐపీఆర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కేయూ ఐపీఆర్‌సెల్ నోడల్ ఆఫీసర్, కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ ప్రసాద్ గురువారం తెలిపారు. యూనివర్సిటీలో అన్ని విభాగాల్లోనూ అధ్యాపకులు, పరిశోధకులు పరిశోధనలు చేస్తున్నారు.అయితే నూతన ఆవిష్కరణలు చేసినప్పుడు వాటికి పేటెంట్ హక్కులు పొందే అవకాశం ఉంటుంది. ఈ హక్కులు ఎలా పొందాల్సింటుంది? అందుకు ఉన్న అవకాశాలు ఏమిటీ?, అలాగే, ఇంటలెక్చువల్ ప్రాపర్టీరైట్స్‌ను ఎలా పొందొచ్చు అనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రోగ్రాం నిర్వహించబోతున్నారని ప్రసాద్ తెలిపారు. టీఎస్ కాస్ట్ ప్రాజెక్టు సైంటిస్ట్ రాధికారెడ్డి, ఐపీఆర్ (ట్రైబ్) డైరెక్టర్ డి అశోక్ హాజరై ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. అందువలన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు హాజరవుతారని తెలిపారు.

క్లుప్తంగా

వండర్‌హాట్ మిర్చికి రూ. 27వేల రికార్డు ధర

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ప్రస్తుత సీజన్‌లో మొదటిసారి వండర్‌హాట్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.27వేల అత్యధిక ధర పలికింది. సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి 11బస్తాల వండర్‌హాట్ రకం మిర్చిని గురువారం వరంగల్ మార్కెట్‌కు తీసుకురాగా మాధవి ట్రేడర్స్ అడ్తిదారుడి ద్వారా టీపీసీ ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో కరీంనగర్ ప్రాంతంలో ముందుగా మిర్చి పంటను సాగు చేయడం వల్ల ఇప్పుడే దిగుబడి వస్తోందని మార్కెట్ గ్రేడ్– 2 కార్యదర్శి రాము తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల తిరుగు ప్రయాణం



కాజీపేట జంక్షన్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలు

కాజీపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వచ్చిన సీఆర్‌పీఎఫ్ బలగాలు గురువారం రాత్రి కాజీపేట జంక్షన్ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. ఎన్నికలు ముగింపు, అభ్యర్థుల ఫలితాలు వెలువడిన అనంతరం తమ రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌కు తిరుగు ప్రయాణమయ్యాయి. 800 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రత్యేక రైలులో వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

న్యూశాయంపేటలో ఉద్రిక్తం



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కాజీపేట అర్బన్ : 31వ డివిజన్‌లోని జూపార్క్ ఎదుట ఉన్న గుట్ట ఆవరణలోని గుడిసెవాసులకు, బల్దియా అధికారులకు గురువారం వాగ్వాదం జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల కథనం ప్రకారం.. 31వ డివిజన్‌లోని హనుమకొండ తహసీల్ జాగీర్‌కు చెందిన 964 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలు వేసుకుని శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారనే సమాచారం మేరకు అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. కాగా, కొంత కాలంగా న్యూశాయంపేట జూపార్క్ ఎదుట గల గుట్ట వద్ద బండలు కొట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ఇక్కడే గుడిసెలు వేసుకున్నామని పేర్కొంటూ వీటిని తొలగించొద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. గుడిసెలు తొలగిస్తే ఆత్మహత్యలకు పాల్పడుతామని పెట్రోల్‌తో హల్‌చల్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న సుబేదారి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గుడిసెవాసులను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. కాగా, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని నాయకులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోకపోవడంతోనే గత్యంతరం లేక గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే తొలగించడం దారుణమని గుడిసెవాసులు వాపోయారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 78/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 150/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 150/-
Cell: 9989299661

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం 15,000/- మాత్రమే. సంప్ర॥ షాబుద్దీన్ – 9618892127. [W-1229325]

■ అతి తక్కువ ధరలో ప్లాటు భూమి ఉంటే ఆర్థిక ఎదుగుదల ఆత్మధైర్యం 2లక్షలకే 121 గ॥ ప్లాటు. యాదాద్రి గుడికి దగ్గరలో ఆలేరు ఫెన్సింగ్, గేటు, సెక్యూరిటీ & EMI. ఫోన్: 8008091512. [H-793544]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, 8437924006 [W-788960]

WANTED

■ Company: One of Reputed Life Insurance Company. Designation: BDM. Age: Min 25yrs. Direct Channel. Location: Warangal. Cell: 8897913131. [WA-7257]

■ Wanted Junior Lecturers (Phy / Che), Field Executive Officer (12 months attractive salary), Warden (Female), Telecallers (Female). Cont: Suvidyaa Junior College, Nakkalagutta, Hanamkonda. Cell: 8885599155, 166. [W-1229491]

■ శ్రీసాయిరాం హోమ్‌నీడ్స్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసుకొనుటకు స్త్రీ/పు కావలెను. జీ:18000, ఏజెంట్ కమీషన్ 7K. ఫోన్: 9666001826, 9666001827 [H-793441]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.